క్లుప్తంగా

నేటి నుంచి నైతికత, మానవీయ విలువల పరీక్షలు

కంబాలచెరువు: మార్చిలో నిర్వహించిన నైతికత, మానవీయ విలువలు, పర్యావరణ పరీక్ష రాయని ఇంటర్ విద్యార్థులు ఈనెల 2, 3 తేదీల్లో జరిగే పరీక్షలకు హాజరుకావాలని ఇంటర్‌బోర్డు ఆర్ఐవో నర్సింహం గురువారం తెలిపారు. వ్యక్తిగత కారణాల వల్ల హాజరు కాలేని విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 2న నైతికత, మానవీయ విలువలు, 3వ తేదీన పర్యావరణ పరీక్ష జరుగుతుందన్నారు. అలాగే ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు జనరల్, వృత్తివిద్యా కోర్సుల ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయన్నారు. జనరల్ ప్రాక్టికల్స్ పరీక్షలను కాకినాడ పీఆర్ కళాశాలలో, వృత్తివిద్యా కోర్సులకు కాకినాడ, ధవళేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో జరుగుతాయని తెలిపారు.

3న జాబ్ మేళా

ప్రకాశం నగర్: వికాస ఆధ్వర్యంలో శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.లచ్చారావు గురువారం సాయంత్రం ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, బీటెక్, ఏదైన డిగ్రీ ఉత్తీర్ణులైన 30 ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి కలవారు ఆ రోజు ఉదయం 9.30 గంటలకు సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో హాజరుకావాలన్నారు. వివరాలకు 83090 10013 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం అందజేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులను దత్తత తీసుకుని, వారికి పౌష్టికాహారం పంపిణీ చేయాలన్న కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత సూచన, డ్వామా పీడీ రామ్‌గోపాల్ సలహాపై పిడింగొయ్యి ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ గిరిజాల చంద్రశేఖర్ స్పందించారు. పిడింగొయ్యి బాపూజీ నగర్‌కు చెందిన చిన్నారి యతికను ప్రతినెలా పౌష్టికాహారం అందించేలా దత్తత తీసుకున్నారు. దీనిలో భాగంగా యతిక తల్లి రమాదేవికి గురువారం బాపూజీనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి ఎం.రూప్ చంద్, జూనియర్ అసిస్టెంట్ మనోజ్, అంగన్‌వాడీ కార్యకర్త దుర్గ చేతుల మీదుగా పౌష్టికాహారాన్ని అందజేశారు.

తులసీదాసు మృతికి సంతాపం

రాజమహేంద్రవరం సిటీ: జిల్లా ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్‌లో ఎన్నో సేవలు అందించిన ప్రిన్స్ స్టూడియో అధినేత కుడుపూడి తులసీదాసు మరణం తీరని లోటు అని ది గోదావరి జోన్ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు అల్లు బాబీ అన్నారు. బెస్తవీధి షాదీఖానాలో గురువారం తులసీ దాసు సంతాపసభ నిర్వహించారు. అసోసియేషన్ గౌరవ సలహాదారులు రావు అండ్ రావు, కొని శ్రీను, ప్రింటోనిక కలర్ ల్యాబ్ గోకుల్ మురళి, శివరామ కలర్ ల్యాబ్ రావు, కేత శ్రీను, ముసిని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: చెట్ల కొమ్మలు తొలగించడం, లైన్ మరమ్మతుల కోసం మోరంపూడి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. మోరంపూడి, శ్రీనగర్, కోనేరుపేట, మహాలక్ష్మి తోట, సాయి బృందావన్ కాలనీ, లారీ స్టాండ్ రోడ్ పరిసర ప్రాంతాలు, అలాగే మార్కెట్ యార్డ్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని జయకృష్ణాపురం, వీరభద్రపురం, ఇంకమ్ టాక్స్ ఆఫీస్ ఏరియా, కోరుకొండ రోడ్డు ఏరియా, ఆదెమ్మ దిబ్బ, హరిపురం, సుబ్బారాయపురం, లలితా నగర్, విద్యానగర్ కాలనీ, సుభాష్ నగర్ ప్రాంతాలలో సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

ధనుంజయ సేవలు చిరస్మరణీయం

కడియం: కాంగ్రెస్ నాయకుడు, వేమగిరి మాజీ సర్పంచ్, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ డైరెక్టర్ దివంగత కాగిత వెంకట ధనుంజయ సేవలు చిరస్మరణీయమని పలువురు అన్నారు. ధనుంజయ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం వేమగిరి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పార్కులోని ఆయన విగ్రహానికి కుటుంబ సభ్యులు, నాయకులు పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. ధనుంజయ కుమార్తె, మాజీ ఎంపీపీ సత్యభారతి, స్థానిక నాయకులు కాగిత రాయప్ప, రాజు, గూడు రాజేంద్ర, పీతల అశోక్, పాస్టర్ డేవిడ్ రాజు, నక్కా వివేకానంద పాల్గొన్నారు.

కార్యదర్శి సరోజా రాణికి సత్కారం

కడియం: డాక్టరేట్ సాధించిన దుళ్ల ఇన్‌చార్జి కార్యదర్శి బి.సరోజా రాణిని గురువారం పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, ఉపసర్పంచ్ తోకల శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ తోకల వీర వెంకట్రావు, వైఎస్సార్ సీపీ నాయకులు తాతపూడి బాబీ, కంటిపూడి సాయి, గోరు శ్రీను పాల్గొన్నారు.

జగన్‌తోనే సంక్షేమ పాలన

- ఎంపీ భరత్‌రామ్
- నగరంలో ర్యాలీ

రాజమహేంద్రవరం సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యమని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా గురువారం నగరంలో మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా జగన్ సమర్థవంతమైన పాలన అందిస్తున్నారన్నారు. పిల్లనిచ్చిన మామను వెన్నుపోటు పొడిచి, కుర్చీని, పార్టీని చివరికి బ్యాంకు అకౌంట్లు కూడా లాక్కుని మానసికంగా, శారీరకంగా హింసించి వేధించిన దుర్మార్గుడు చంద్రబాబు నాయుడు అని ధ్వజమెత్తారు. ఇప్పుడు ఎన్టీఆర్ మా దేవుడు అంటూ విగ్రహాలకు దండలు వేసి, శతజయంతి ఉత్సవాలు నిర్వహించి ఆయన ఆత్మకు శాంతి లేకుండా చేస్తున్నారన్నారు. ఎన్టీఆర్ ఉన్నప్పుడు మహానాడును పెద్ద పండగగా అందరూ భావించే వారని, కానీ చంద్రబాబు నిర్వహించే మహానాడు ఒక రాజకీయ స్వార్థం, వసూలు కోసం అన్నట్టుగా మారిందన్నారు. మహానాడుకు కనీసం పదివేల మంది కూడా హాజరు కాలేదన్నారు. రాజమహేంద్రవరం నగరాన్ని నెంబర్ వన్ సిటీగా తీర్చిదిద్దుతామన్నారు. రానున్న ఎన్నికలలో వైఎస్సార్ సీపీ విజయం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఏపీఐడీసీ స్టేట్ డైరెక్టర్ కానుబోయిన సాగర్, వక్ఫ్‌బోర్డు జిల్లా అధ్యక్షుడు ఆరిఫ్, రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి గుర్రం గౌతమ్, నగర మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, పార్టీ నాయకులు గుత్తుల మురళీధర్, పీతా రామకృష్ణ, మజ్జి అప్పారావు, కాటం రజనీకాంత్, బర్రే కొండబాబు, నక్కా నగేష్, అరిగెల బాబు, రామ్ సాయిదీప్, ఉల్లూరి రాజు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీ సంబరాల్లో మాట్లాడుతున్న ఎంపీ భరత్ రామ్

ఐరిస్‌తో వృద్ధులకు రేషన్

రాజమహేంద్రవరం సిటీ: వేలిముద్రలు పడక ప్రభుత్వం అందజేసే రేషన్ సరకులు అందడం లేదని పలువురు వృద్ధులు గడప గడపకూ మన ప్రభుత్వం, గుడ్ మార్నింగ్ రాజమహేంద్రవరం, రచ్చబండ కార్యక్రమాల్లో ఎంపీ మార్గాని భరత్ రామ్‌కు మొరపెట్టుకున్నారు. ఆ ఇబ్బందులపై స్పందించిన ఎంపీ ఎండీయూ ఆపరేటర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫింగర్ ప్రింట్ పడటం లేదని ఎంపీకి తెలిపారు. దీంతో ఉన్నతాధికారులకు ఈ సమస్యకు పరిష్కారం చూడాలని కోరారు. ఈ నేపథ్యంలోనే గురువారం ఎండీయూ ఆపరేటర్లకు ఐరిస్ మెషీన్లు అందజేశారు. ఎంపీ భరత్ సమక్షంలో పలువురు వృద్ధులకు ఐరిస్ మెషీన్లు ఉపయోగించి రేషన్ బియ్యం పంపిణీ చేశారు.

ట్రేడ్ లైసెన్స్ పరిధిలోనే వ్యాపారాలు

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని వ్యాపారాన్నింటినీ డీఓ ట్రేడ్ లైసెన్సు పరిధిలోకి తీసుకురావాలని కమిషనర్ దినేష్ కుమార్ ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయం కౌన్సిల్ హాల్లో ప్రజారోగ్య విభాగం కార్యక్రమాలపై మున్సిపల్ హెల్త్ ఆఫీసర్, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, వార్డు శానిటేషన్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలతో గురువారం సమీక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో డీఓ ట్రేడ్ లైసెన్సు తీసుకోకుండా కొందరు వ్యాపారాలు నిర్వహిస్తున్నారన్నారు. సచివాలయాల వారీగా వ్యాపారాలను సర్వే చేసి మేపింగ్ చేసుకుని లైసెన్సు ఫీజును వసూలు చేయాలన్నారు. 2023–24 ముందస్తు లైసెన్సు ఫీజును చెల్లించని వారి నుంచి లేటు ఫీజుతో వసూలు చేయాలన్నారు. నగరంలోని రోడ్లపై పశువులను వదిలితే తిరిగి ఇవ్వబోమని యజమానులకు ఆఖరి హెచ్చరికగా తెలియ చేయాలన్నారు. కుక్కలకు ఏబీసీ ఆపరేషన్లు వేగవంతం చేయాలని, పందుల నియంత్రణకు సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఏ.వినూత్న, శానిటరీ సూపర్‌వైజర్లు ఐ.శ్రీనివాస్, కె.రామలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ దినేష్‌కుమార్

రోడ్డు పనుల పరిశీలన

మోరంపూడి రోడ్డు విస్తరణకు జూన్ నెలాఖరులోగా రోడ్డు విస్తరణ పనులు, డ్రైన్ పనులను పూర్తి చేసి పూర్తిస్థాయి రోడ్డును వినియోగంలోనికి తీసుకురావాలని కమిషనర్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగు విభాగం అధికారులతో కలిసి తనిఖీ చేశారు. జయశ్రీ గార్డెన్స్, షిరిడీ సాయి మార్గ్‌లోని అపార్ట్‌మెంట్లకు ఆక్యుపెన్సీ జారీచేయడం కోసం పట్టణ ప్రణాళికా విభాగం అధికారులతో కలిసి భవనాలను పరిశీలించారు. సిటీ ప్లానర్ సూరజ్ కుమార్, ఏసీపీ వరహాలబాబు, ఈఈ శేషగిరిరావు, డీఈ ప్రకాశరావు పాల్గొన్నారు.

సెంట్రల్ జైలుకు తీసుకువస్తుండగా ఖైదీ పరార్

రాజమహేంద్రవరం రూరల్: సెంట్రల్ జైలుకు తీసుకువస్తుండగా ఖైదీ పరారయ్యాడని భీమవరం ఏఆర్‌పీసీలు నిమ్మల వెంకటరత్నం, ఎస్‌వీడీ మహేష్ గురువారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా.. భీమవరం ఏఆర్ ఎస్సై ఉత్తర్వుల మేరకు ఏఆర్‌పీసీలు నిమ్మల వెంకటరత్నం, ఎస్‌వీడి మహేష్ పోడూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నిమిత్తం పాలకొల్లు కోర్టులో హాజరుపరిచేందుకు రాజమహేంద్రవరం సెంట్రల్‌జైల్లో పీడీయాక్టులో శిక్ష అనుభవిస్తున్న పొన్నాడ రవిశంకర్ (వీరబాబు)ను తీసుకువెళ్లేందుకు బుధవారం రాజమహేంద్రవరం వచ్చారు. సెంట్రల్‌జైల్లో అతడిని తీసుకుని పాలకొల్లులో అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. తీర్పు అనంతరం వీరబాబు తీసుకుని ఆర్టీసీ బస్సులో రాజమహేంద్రవరం వచ్చి షెల్టాన్ జంక్షన్‌లో రాత్రి 9.30 గంటలకు దిగారు. అక్కడి నుంచి సెంట్రల్ జైలుకు వెళ్లేందుకు బస్సు కోసం వేచి చూస్తుండగా వీరబాబు ఆ ఇద్దరు పీసీలను తోసి వేసి కేసుకు సంబంధించిన ఫైల్స్‌తో పరారయ్యాడు. ఈ మేరకు బొమ్మూరు ఎస్సై శివాజీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పరారైన ఖైదీ పొన్నాడ రవిశంకర్ (వీరబాబు) స్వగ్రామం యానాం సమీపంలోని ఏటిమొగ. ఇతడు పలు చోరీ కేసుల్లో నిందితుడిగా ఉండడంతో పాటు పీడీయాక్టు కూడా ఉంది.

పర్యావరణ రక్షణ అందరి బాధ్యత

ప్రకాశం నగర్: పర్యావరణ రక్షణ సమష్టి బాధ్యత అని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ డి.ఆశారేఖ అన్నారు. ప్రాంతీయ ఆటవీ పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో గురువారం స్థానిక గౌతమీ పుష్కర వనం వద్ద కరాటే విద్యార్థులకు పచ్చదనంపై అవగాహన కల్పించారు. కాలుష్యాన్ని అరికట్టడానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కరాటే మాస్టార్ నాగరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

7న వాహనాల వేలం

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో రాజమహేంద్రవరం నార్త్ స్టేషన్ పరిధిలో సారా, ఇతర నేరాల్లో పట్టుకున్న మూడు మోటారు వాహనాలకు ఈనెల 7వ తేదీ ఉదయం 10 గంటలకు స్టేషన్ ఆవరణలో వేలం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ గురువారం ప్రకటనలో తెలిపారు.

యువకుడి అదృశ్యం

కంబాలచెరువు: స్థానిక విద్యానగర్‌కు చెందిన గంధం శ్రీసాయి నగేష్ అనే యువకుడు అదృశ్యమైన సంఘటనపై మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అయిన సాయినగేష్ వర్క్ ఫ్రమ్ హోం చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతను తిరిగి రాలేదు. దీంతో తండ్రి రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

టైలరింగ్‌లో శిక్షణ

రాజానగరం: ఏపీ స్టేట్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ప్రాంగణంలోని కామన్ ప్రొడక్షన్ సెంటర్ భవనంలో నిర్వహిస్తున్న స్కిల్ హబ్‌లో మహిళలకు టైలరింగ్‌లో శిక్షణను ప్రారంభించనున్నామని ఆ సంస్థ జిల్లా అధికారి ఎం.కొండలరావు తెలిపారు. ఆసక్తి కలిగిన 18 ఏళ్ల నుంచి 35 ఏళ్లలోపు వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు 83285 07473 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

టీడీపీకే రాజానగరం సీటు

సీతానగరం: జనసేనతో పొత్తుఉన్నా తెలుగుదేశం పార్టీకే రాజానగరం నియోజకవర్గాన్ని కేటాయిస్తారని టీడీపీ బీసీ నాయకుడు బర్ల బాబూరావు అన్నారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. రాజానగరం నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయించారని ఆ పార్టీ నాయకుడు బత్తుల బలరామకృష్ణ తప్పుడు ప్రచారం చేసుకుంటున్నారన్నారు. కొత్తగా ఏర్పడిన తూర్పుగోదావరి జిల్లాలో ఏడు నియోజకవర్గాలు ఉన్నాయని, అందులో రాజమహేంద్రవరం రూరల్‌ను జనసేన కందుల దుర్గేష్‌కు కేటాయించారన్నారు. దీంతో రాజానగరంలో జనసేనకు అవకాశం ఉండదన్నారు.

సంస్మరణ సభ

ప్రకాశం నగర్: జిల్లా అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో కవులు కేతు విశ్వనాథ రెడ్డి, శీలా వీర్రాజు సంస్మరణ సభ నిర్వహించారు. కార్యక్రమానికి అరసం అధ్యక్షుడు పడాల వీరభద్రరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంఘ కార్యదర్శి బొల్లినేని నాగార్జున సాగర్ తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు 82.37 శాతం పింఛన్ల పంపిణీ

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ పింఛన్ కానుక లబ్ధిదారులకు ఒకటో తేదీ పండగలా మారింది. నేరుగా ఇంటి వద్దకే పింఛన్ అందుతోంది. జూన్‌కు సంబంధించి తొలిరోజు గురువారం రాత్రి 7 గంటల వరకు జిల్లాలో 82.37 శాతం పింఛన్లు పంపిణీ చేశారు. జిల్లావ్యాప్తంగా 2,34,205 మందికి వైఎస్సార్ పింఛన్ కానుక కింద రూ.64.56 కోట్లు విడుదలైంది. ఇందులో తొలిరోజు 1,92,917 మందికి రూ.53.14 కోట్లు పంపిణీ చేశారు. కొవ్వూరు అర్బన్ 87.17 శాతంతో ప్రథమ, రాజానగరం మండలం 70.02 శాతంతో చివరిస్థానంలో ఉన్నాయి. ఈ నెల 5వ తేదీ వరకు పింఛన్లు పంపిణీ చేస్తామని డీఆర్‌డీఏ వైఎస్సార్ క్రాంతిపథం ప్రాజెక్టు డైరెక్టర్ సిరిపురపు సుభాషిణి తెలిపారు.



అకీరా ఆసుపత్రిలో కంటి శస్త్రచికిత్స చేయించుకున్న రూబీన్సీకి పింఛన్ అందిస్తున్న కోలమూరు -4 వలంటీర్ సత్యనారాయణ

రెజ్లర్లకు మద్దతుగా కార్మిక సంఘాల ధర్నా



శ్యామలా సెంటర్‌లో ధర్నా చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

ప్రకాశం నగర్: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని, సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఆధ్వర్యంలో సమగ్ర విచారణ జరిపించి కఠినంగా శిక్షించాలని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం స్థానిక శ్యామల సెంటర్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ, సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, ఐఎఫ్‌టీయూ నాయకుడు కె.జోజి, కాంగ్రెస్ నాయకుడు మురళీధర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎం. సుందరబాబు మాట్లాడుతూ 38 కేసుల్లో తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ చరణ్ సింఘ్‌ను ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ ప్రభుత్వం కాపాడుతోందని ఆరోపించారు.

క్షేత్రస్థాయిలో మోదీ విజయాల ప్రచారం

రాజమహేంద్రవరం సిటీ: ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, తొమ్మిదేళ్ల సుపరిపాలన విజయాల ప్రచారం కార్యక్రమం క్షేత్రస్థాయిలో నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర సహ ఇన్‌చార్జి సునీల్ దియోధర్ పిలుపు నిచ్చారు. గురువారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో సంయుక్త మోర్చాల జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అసెంబ్లీ ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేటుకూరు సూర్యనారాయణ రాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరిమి రాధాకృష్ణ పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: భారతీయ జనతా పార్టీ తొమ్మిదేళ్ల పాలనలో చేపట్టిన సుపరిపాలనను ప్రతి ఇంటికి చేరేలా ప్రతి కార్యకర్త, నాయకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆపార్టీ జాతీయ కార్యదర్శి సునీల్ దియోధర్ పిలుపునిచ్చారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా గురువారం హుకుంపేటలోని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు కరుటూరి శ్రీనివాసరావు ఇంటి వద్ద కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు.



పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న సునీల్ దియోధర్

ఉపాధిలో పనిదినాల లక్ష్యం సాధించాలి

- ప్రాధాన్యతా భవనాల నిర్మాణం వేగవంతం
- కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఉపాధి హామీ పథకం కింద జూన్‌లో 10.34 లక్షల పనిదినాల లక్ష్యం సాధించాలని కలెక్టర్ మాధవీలత అధికారులను ఆదేశించారు. జేకేసీ, రీసర్వే, భూసేకరణ, హౌసింగ్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, తాగునీరు, మౌలిక సదుపాయాలు, స్పందన తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి గురువారం వెలగపూడి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాధవీలత అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణం మరింత వేగవంతం చేయాలన్నారు. రెవెన్యూ పరమైన అంశాలపై ఫిర్యాదుల పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, రికార్డుల నిర్వహణ, భూ ఆక్రమణ తదితర వాటిపై జేకేసీలో ఫిర్యాదులు అందయన్నారు. వాటితో పాటు పంచాయతీరాజ్‌కు చెందిన పారిశుధ్యం, తాగునీటి సమస్య, విద్యుత్ శాఖకు చెందిన విద్యుత్ అంతరాయం, గ్రామ సచివాలయ సేవలపై 1902 టోల్ ఫ్రీ నంబర్‌కు గత 15 రోజుల్లో వచ్చిన 1,225 ఫిర్యాదుల్లో 717 పరిష్కారం చూపగా, మిగిలినవి పరిశీలనలో ఉన్నట్లు తెలిపారు. 24 గంటల్లోగా ఆయా అర్జీలను చూసి వాటిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రీసర్వే పనులు 32,498, భూహక్కు పట్టాలలో 32,443 పంపిణీ చేశారని, నవరత్నాలు పేదలందరికీ ఇళ్లకింద 60,822 మందికి ఎస్‌హెచ్‌జీ రుణాలకుగాను 48,533కు ముందస్తు రుణాలు మంజూరు చేశారన్నారు. గత 15 రోజుల్లో 8,597 మందికి రుణాలు మంజూరు చేయడంపై అభినందించారు. జూన్‌లో ఇచ్చిన 10.34 లక్షల లక్ష్యాన్ని మండలాల వారీగా మొదటి పక్షంలో పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్, సహాయ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత

పాఠ్యపుస్తకాల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న విద్యాకానుక అందజేస్తోందని, జిల్లావ్యాప్తంగా ఈనెల 12వ తేదీకి విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలతో జగనన్న విద్యాకానుక అందించేందుకు పూర్తి ఏర్పాట్లు చేశామని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం తెలిపారు. జిల్లాలోని పలు పాఠ్యపుస్తకాల డిపోలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ధవళేశ్వరంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని 64 మండలాల స్టాక్ పాయింట్ లకు ఇప్పటి వరకూ దాదాపు 25 లక్షల మూడువేల పుస్తకాలను సరఫరా చేశామని, ఇంకా 8 లక్షల వరకూ రానున్నాయన్నారు. పుస్తకాలను ఎప్పటికప్పుడు ఇండెంట్ ప్రకారం మండల స్టాక్ పాయింట్లకు తరలించాలని మేనేజర్‌ను ఆదేశించారు. స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.



ధవళేశ్వరం స్టాక్ పాయింట్‌లో పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న డీఈవో అబ్రహం

తిరుమలకు పాదయాత్ర

రాజానగరం: కాకినాడలోని భోగి గణపతి పీఠం వ్యవస్థాపకుడు దూసర్లపూడి రమణరాజు చేపట్టిన తిరుమల పాదయాత్ర గురువారం సాయంత్రం రాజానగరం చేరుకుంది. సూర్యారావుపేటలో జాతీయ రహదారిని అనుకుని ఉన్న కనక దుర్గ ఆలయంలో పూజలు చేసి, దివాన్‌చెరువు, గామన్ బ్రిడ్జి మీదుగా కొవ్వూరు వైపు పయనమయ్యారు.